# సినిమా న్యూస్

## శేఖర్ కమ్ముల ముందు కొత్త సవాల్



తెలుగు సినిమా పరిశ్రమలో అద్భుతమైన క్రేజ్ కలిగిన దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. మొదటి నుంచి క్లాస్ చిత్రాలను తెరకెక్కిస్తూ వరుస విజయాలను అందుకున్న ఆయన, దర్శకుడిగా ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు.

మంచి క్రేజ్ ఉన్నప్పటికీ శేఖర్ కమ్ముల ఇప్పటివరకు స్టార్ హీరోలతో సినిమాలు చేయకుండా ఎక్కువగా చిన్న, మిడ్-రేంజ్ హీరోలతోనే సినిమాలు చేస్తూ వచ్చారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో ధనుష్ హీరోగా తెరకెక్కిన 'కుబేర' చిత్రం మంచి విజయాన్ని అందుకుంది.

ఇక తన తదుపరి సినిమా కోసం ఇప్పటికే కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఏషియన్ సునీల్ నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రాజెక్ట్ విషయంలో శేఖర్ కమ్ములకు ఒక కొత్త సవాలు ఎదురైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో క్రేజ్ ఉన్న మిడ్-రేంజ్ హీరోలు దాదాపు అందరూ ఒకటి లేదా రెండు ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో, వెంటనే బల్క్ డేట్స్ ఇచ్చే హీరోను ఎంపిక చేయడం కష్టంగా మారినట్లు సమాచారం. దీంతో ఆయన ఇతర భాషలకు చెందిన హీరోలపై కూడా దృష్టి సారించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరి ఈ టాలెంటెడ్ దర్శకుడు తన తదుపరి చిత్రాన్ని ఏ హీరోతో తెరకెక్కిస్తారో అనే ఆసక్తి ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో నెలకొంది.

## ఫ్లాప్స్ ఉన్నా తగ్గని నితిన్ క్రేజ్



సినిమా ఇండస్ట్రీలో హిట్లు అందుకున్న వారికి వరుసగా అవకాశాలు రావడం, అదే వరుస ఫ్లాప్స్ ఎదురైన హీరోలకు అవకాశాలు తగ్గిపోవడం సర్వసాధారణమే. అయితే కొందరు హీరోలు మాత్రం ఫ్లాప్స్ వచ్చినప్పటికీ వరుస అవకాశాలను అందుకుంటూ ముందుకు సాగుతుంటారు. అలాంటి వారిలో నితిన్ ఒకరు. ఈయనకు సరైన హిట్ వచ్చి చాలా సంవత్సరాలు అవుతోంది. గత కొంతకాలంగా నితిన్ నటించిన అనేక సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి.

అయినప్పటికీ ఆయన జోరు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. నితిన్ ప్రస్తుతం కొత్త దర్శకులు నారి, సోము దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. దీనిని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగ వంశీ నిర్మిస్తున్నారు. అలాగే 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వంలో కూడా ఓ సినిమాకు నితిన్ ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా బ్యానర్ నిర్మించనుండగా, షూటింగ్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుందని సమాచారం.

అలాగే తాజాగా 'ఆయ్' ఫేమ్ అంజి దర్శకత్వంలో కూడా నితిన్ మరో సినిమాకు కమిట్ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని శ్రేష్ఠ మూవీస్ బ్యానర్ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈ మూవీ షూటింగ్ డిసెంబర్ నుంచి ప్రారంభం కానుందని సమాచారం. ఇలా వరుస ఫ్లాప్స్ ఎదురైనా కూడా నితిన్ ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా మూడు సినిమాలను లైన్లో పెట్టి పక్కా ప్రణాళికతో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది.




## పోటీ లేదు.. టెన్షన్ లేదు

నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్'. ఈ సినిమాలో ఖయాదూ లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్ఎల్‌వీ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను తొలుత మార్చి 26న విడుదల చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ, ఆ తేదీన విడుదల కాలేదు. అనంతరం ఆగస్టు 21న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించినా, అప్పటికీ సినిమా సిద్ధం కాకపోవడంతో వాయిదా పడింది.

దీంతో ఈ చిత్రం ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అనే ఆసక్తి సినీ వర్గాలతో పాటు అభిమానుల్లోనూ నెలకొంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టులో ఇప్పటికే పలువురు స్టార్ హీరోల సినిమాలు విడుదలకు సిద్ధమవుతుండగా, అక్టోబర్‌లో దసరా సందర్భంగా కూడా పలు చిత్రాల రిలీజ్ తేదీలు ఖరారయ్యాయి. అయితే సెప్టెంబర్‌లో పెద్ద సినిమాలు లేకపోవడంతో 'ది ప్యారడైజ్'ను సోలోగా విడుదల చేయాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ తేదీని పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంది.

## ధనుష్, వెట్రిమారన్ కొత్త సినిమా




కోలీవుడ్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్, సెన్సేషనల్ కాంబినేషన్‌గా పేరుగాంచిన నటుడు ధనుష్, సంచలన దర్శకుడు వెట్రిమారన్ మళ్లీ చేతులు కలిపారు. వీరిద్దరి కలయికలో రాబోతున్న 5వ ప్రతిష్టాత్మక చిత్రానికి "తమిళ మురుగన్"అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్ర బృందం జూలై 10న అధికారికంగా అనౌన్స్ చేసింది. ఈ ఎపిక్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ ప్రోమో సోషల్ మీడియాలో సంచలనం రేగుతోంది.

**తమిళ సంస్కృతి నేపథ్యంలో!**

తమిళ సంస్కృతి, పురాణాలలో ప్రత్యేక స్థానమున్న సుబ్రహ్మణ్య స్వామి లెగసీ ఆధారంగా ఈ చిత్రాన్ని ఒక హిస్టారికల్-ఎపిక్ తరహాలో తెరకెక్కిస్తున్నారు. మురుగన్‌ను కేవలం దైవంగానే కాకుండా, తమిళ ప్రజల సంరక్షకుడిగా, గొప్ప యోధుడిగా, రాజుగా, తిరుగులేని నాయకుడిగా ఈ చిత్రంలో చూపించబోతున్నారు.

**రకరకాల చర్చలకు దారితీసిన ఫస్ట్ లుక్!**

చిత్ర యూనిట్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇందులో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ ఆయుధమైన 'వేల్' పట్టుకుని, వెనుక భారీ సైన్యంతో కనిపిస్తున్న విజువల్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉన్నాయి. ఈ పోస్టర్‌ను #SonOfKottravai అనే పవర్‌ఫుల్ హ్యాష్‌ట్యాగ్‌తో విడుదల చేశారు.

**మరోసారి బాక్సాఫీసు బద్దలేనా?**

గతంలో ధనుష్ - వెట్రిమారన్ కాంబినేషన్‌లో వచ్చిన పొల్లాదవన్, ఆడుకాలం, వడ చెన్నై, అసురన్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మైలురాళ్లుగా నిలిచాయి. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ జాతీయ అవార్డును కూడా అందుకున్నారు. దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ క్రేజీ కాంబో మళ్లీ సెట్స్ పైకి వెళ్తుండటం, అది కూడా తమిళ సెంటిమెంట్, డివోషనల్-వారియర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తుండటంతో అటు అభిమానుల్లో, ఇటు ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'అల్టిమేట్' చార్ట్‌బస్టర్ సాంగ్స్‌తో క్రేజ్ తెచ్చుకున్న యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం మరో అదనపు ఆకర్షణ.